జనానికి మోత.. వాహన డ్రైవర్లకు వాత

- ఇంటింటికీ బియ్యం పంపిణీకి కూటమి ప్రభుత్వం మంగళం
- మళ్లీ రేషన్ దుకాణాల ముందు పడిగాపులే
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న కార్డుదారులు


వాహనం ద్వారా కార్డుదారుడికి ఇంటి వద్దనే సరుకులు అందిస్తున్న దృశ్యం


గతంలో కోడుమూరులో రేషన్ దుకాణం ముందు కార్డుదారుల క్యూ

కోడుమూరు రూరల్: ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల ఇంటి ముంగిటకే వాహనాల ద్వారా నిత్యావసర వస్తువులను అందజేస్తుండేది. తద్వారా ప్రజలు బియ్యం మొదలగు నిత్యావసర వస్తువుల కోసం రేషన్ దుకాణాల ముందు క్యూలైన్లో నిలబడాల్సిన పని ఉండేది కాదు. ఎంచక్కా తమ ఇంటి ముంగిటకే వచ్చిన వాహనంలో కార్డుదారులు బియ్యాన్ని తీసుకునే వారు. దీనివల్ల కార్డుదారులకు వ్యయ ప్రయాసలుండేవి కాదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇంటి వద్దకే బియ్యం పంపిణీ వ్యవస్థకు మంగళం పాడింది. దీనివల్ల కార్డుదారులు మళ్లీ సరుకుల కోసం రేషన్ దుకాణాల ముందు క్యూలైన్లో నిలబడాల్సిన దుస్థితి దాపురించింది.

ఆ గ్రామాల్లో రేషన్ దుకాణాల్లేవు

కోడుమూరు మండలంలోని బైనదొడ్డి గ్రామంలో 400 మందికిపైగా జనాభా ఉండగా 77 రేషన్ కార్డులున్నాయి. గ్రామంలో రేషన్ దుకాణం లేక ఐదు కిలోమీటర్ల దూరంలోని కల్లపరి గ్రామానికి వెళ్లి డీలర్ వద్ద రేషన్ సరుకులు తీసుకోవాల్సి ఉంది. అలాగే సి.బెళగల్ మండలంలోని బ్యాతోలి గ్రామంలో 700కు పైగా జనాభా ఉండగా, 186 కార్డులున్నాయి. అయినప్పటికీ రేషన్ దుకాణం లేకపోవడంతో మూడు కిలోమీటర్ల దూరంలోని బురాన్‌దొడ్డికి వెళ్లి రేషన్ సరుకులను తీసుకోవాల్సి ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులను అందించేది. దీంతో ఆయా గ్రామస్తులు రేషన్ బియ్యాన్ని తమ ఊర్లోనే ఇంటి వద్దనే తీసుకునేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బియ్యం పంపిణీ వాహనాలను నిలిపేస్తున్నట్లు ప్రకటించడంతో తమకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

మండలాల వారీగా రేషన్ కార్డుదారులు, బియ్యం పంపిణీ వాహనాలు		
మండలంలో	బియ్యం పంపిణీ వాహనాలు	రేషన్ కార్డుదారులు
కోడుమూరు	16	23121
గూడూరు	10	14711
సి.బెళగల్	11	18279

మళ్లీ కష్టాలు మొదలవుతున్నాయి



మా బ్యాతోలి గ్రామంలో రేషన్ దుకాణం లేదు. బియ్యం కావాలంటే మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బురాన్‌దొడ్డికి వెళ్లి తెచ్చుకోవాలి. మా పరిస్థితి అర్థం చేసుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బియ్యం పంపిణీ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులను అందించేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాహనాలను నిలిపేస్తున్నట్లు ప్రకటించడంతో మళ్లీ మాకు కష్టాలు మొదలయ్యాయి. బియ్యం కావాలంటే ఆటోలు, బండ్లపై వెళ్లి తెచ్చుకోవాలి. ఇది మాకు ఎంతో వ్యయప్రయాస.

– సోమన్న, బురాన్‌దొడ్డి గ్రామం, సి.బెళగల్ మండలం

కుటుంబాలను ఎలా పోషించుకోవాలి



కోడుమూరులో బియ్యం పంపిణీ వాహన డ్రైవర్‌గా పనిచేస్తూ మూడేళ్ల నుంచి ఉపాధి పొందుతున్నా. ఉన్నఫళంగా కూటమి ప్రభుత్వం బియ్యం పంపిణీ వాహన వ్యవస్థను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పుడు ఏమి చేయాలో అర్థం కావడం లేదు. ఇన్నాళ్లు బియ్యం పంపిణీ వాహనాలకు కంతులు సైతం కట్టుకున్నాం. బియ్యం పంపిణీని రద్దు చేస్తే వాహనాలను ఏమి చేయాలి, వాహనాల కోసం మేము కట్టిన డబ్బుల పరిస్థితి ఏమిటన్నది ప్రభుత్వమే తేల్చాలి. మాకు ఏ విధంగా జీవనోపాధి కల్పిస్తారో చెప్పాలి.

– నాగభూషణం రెడ్డి, కోడుమూరు

మళ్లీ రేషన్ కష్టాలు

పాణ్యం: ఐదేళ్ల పాటు ఇంటి వద్దే రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులకు మళ్లీ పాత కష్టాలు తప్పేలా లేవు. రేషన్ వాహనాలను రద్దుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంటోంది. పనులు మానుకుని గంటల తరబడి క్యూలో నిలుచోవాల్సి వస్తుందని పాత రోజులను తలుచుకుంటున్నారు. పాణ్యం నియోజకవర్గంలో మొత్తం 66,874 మంది రేషన్‌కార్డుదారులు ఉండగా 135 రేషన్ దుకాణాలు ఉన్నాయి.

మళ్లీ మొదటికి..

ఇంటింటికి రేషన్ అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియోజకవర్గంలో 43 ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. ఎక్కడా రేషన్ అక్రమాలకు తావు లేకుండా సరైన సమయంలో లబ్ధిదారులకు సరుకులు అందేది. ఐదేళ్ల పాటు సాఫీగా లబ్ధిదారులు రేషన్ తీసుకున్నారు. అయితే ఇప్పుడు ఆ వాహనాలను పక్కన పెట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్‌షాపుల వద్దే రేషన్ తీసుకోవాలనే నిర్ణయంతో మళ్లీ కొలతల్లో తేడాలు, అక్రమాలకు అవకాశం కల్పించినట్లు అవుతందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


బలపనూరులో ఎండీయూ వాహనం వద్ద రేషన్ తీసుకుంటున్న ప్రజలు

పాణ్యం నియోజకవర్గంలో రేషన్ దుకాణాల వివరాలు			
మండలం	రేషన్ కార్డులు	దుకాణాలు	ఎండీయూ వాహనాలు
పాణ్యం	14994	32	9
ఓర్వకల్లు	18886	35	12
కల్లూరు	19155	36	13
గడివేముల	13839	32	9
మొత్తం	66874	135	43

2 కి.మీ దూరం వెళ్లాలి



ఇకపై రేషన్ తెచ్చుకోవాలంటే రెండు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి. గతంలో వాహనం ఇంటి ముందుకే వచ్చి రేషన్ అందించే వారు. వలంటీర్లు ముందుగానే సమాచారం ఇవ్వడంతో ఇబ్బంది లేకుండా రేషన్ తీసుకునేవాళ్లం. ఇప్పుడు వాహనాలు నిలిపేస్తే ఇబ్బంది పడాల్సి వస్తుంది. రేషన్ తెచ్చుకునేందుకు ఐదారు మంది కలిసి ఆటో తీసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. పనులు మానుకుని క్యూలో వేచిఉండాలి.

– ప్రమీల, అహల్యాపురం, పాణ్యం

వాహనాలతోనే రేషన్ అందించాలి



గత ప్రభుత్వంలో ఇళ్ల వద్దకే వచ్చి రేషన్ సరుకులు అందించేవారు. వాహనాలు రద్దు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో మళ్లీ పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి. మా ఊరి నుంచి 3 కిలోమీటర్లు దూరంలో ఉన్న తడకనపల్లెకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సి ఉంటుంది. రవాణా చార్జీలు భరించాల్సి వస్తుంది. మాకు వాహనాల ద్వారానే రేషన్ అందిస్తే బాగుంటుంది.

–లక్ష్మీబాయి, ఓబులాపురం తండా, కల్లూరు

ఈ గ్రామస్తులకు ఇబ్బందులే

- గడివేముల మండలం సోమపురం గ్రామస్తులు ప్రతి నెలా సుమారు 2 కి.మీ దూరంలోని కొర్రపాలూరు గ్రామానికి వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి.
- పాణ్యం మండలం అహల్యాపురం గ్రామంలో రేషన్ దుకాణం లేకపోవడంతో రెండు కి.మీ దూరంలో ఉన్న అనుపూరు గ్రామానికి వెళ్లి రేషన్ తెచ్చుకోవాలి.
- గుమ్మితెం తండా ప్రజలు సుమారు 6 కి.మీ దూరంలోని బ్రహ్మణపల్లెకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాలి.
- హెచ్ కొట్టాల గ్రామస్తులు 2 కి.మీ దూరంలో ఉన్న హుసేనాపురానికి వెళ్లి రేషన్ తీసుకోవాల్సి ఉంటుంది.
- కల్లూరు మండలం తడకనపల్లె గ్రామ పరిధిలో అర కిలోమీటర్ దూరం ఉన్న వామసముద్రం, కిలోమీటర్ దూరం ఉన్న ఓటబులాపురం, 3 కి.మీ ఉన్న ఓబులాపురం తండా ప్రజలు రేషన్ కోసం తడకనపల్లెకు వచ్చి రేషన్ తీసుకోవాల్సిన పరిస్థితి.

క్లుప్తంగా

హెల్త్ ఎడ్యుకేటర్ నియామకం


సి.బెళగల్ పీహెచ్‌సీలో బాధ్యతలు స్వీకరిస్తున్న పుష్పావతి

సి.బెళగల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి హెల్త్ ఎడ్యుకేటర్ (హెచ్‌ఈ)గా పుష్పావతి నియామకం అయినట్లు డాక్టర్ సునీత తెలిపారు. పీహెచ్‌సీలో హెచ్‌ఈగా ఉన్న ఆదినారాయణ గతేడాది అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటినుంచి ఈ పోస్టు ఖాళీగా ఉండగా ప్రస్తుతం పుష్పావతి నియామకంతో భర్తీ అయినట్లు డాక్టర్ తెలిపారు. జూపాడుబంగ్లా పీహెచ్‌సీ నుంచి వచ్చిన పుష్పావతి సోమవారం విధుల్లో చేరారు.

సీజ్ చేసిన వాహనాల వేలం

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డ వాహనాలకు సోమవారం సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది వేలం పాట నిర్వహించారు. మొత్తం 5 వాహనాలకు వేలం పాట నిర్వహించగా పాటదారులు 4 వాహనాలను దక్కించుకున్నారని చెప్పారు, 4 వాహనాలకు జీఎస్టీతో కలిపి మొత్తం రూ.2,16,934 ఆదాయం వచ్చినట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. సెబ్ ఎస్‌ఐ అలీబేగ్ ఉన్నారు.

ప్రజా సమస్యలు పట్టని అధికారులు


కోడుమూరులో డీటీకి వినతిప్రతం అందజేస్తున్న వర్కూరు వాసి

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి పలువురు మండలాధికారులు గైర్హాజరయ్యారు. కార్యక్రమానికి డిప్యూటీ తహసీల్దార్ రామాంజినేయులు, ఏఓ రవిప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్‌తో పాటు మరో మూడు శాఖల సిబ్బంది తప్ప మిగిలిన వారెవ్వరు హాజరు కాలేదు. దీంతో సమస్యలు విన్నవించేందుకు వచ్చిన ప్రజలు ఆయా శాఖల అధికారులు లేకపోవడంతో డీటీకి వినతిపత్రం ఇచ్చి వెనుదిరిగి వెళ్లారు.

కోడుమూరు ఎస్‌ఐగా శ్రీనివాసులు



కోడుమూరు రూరల్: కోడుమూరు ఎస్‌ఐగా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న బాలనరసింహులు బదిలీపై కర్నూలు–1 టౌన్‌కు వెళ్లిపోయారు. దీంతో కోడుమూరు ఎస్‌ఐగా కె.నాగలాపురం పీఎస్‌లో పనిచేస్తున్న శ్రీనివాసులును జిల్లా అధికారులు నియమించారు. ఈ మేరకు శ్రీనివాసులు కోడుమూరు ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించి స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలపై సిబ్బందితో చర్చించారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం


మద్యాన్ని ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ మద్యాన్ని సోమవారం కర్నూలు సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ధ్వంసం చేశారు. 4 కేసుల్లో సీజ్ చేసిన 59 లీటర్ల నాటుసారా, 10 కేసుల్లో సీజ్ చేసిన 33 లీటర్ల తెలంగాణ, ఆంధ్ర మద్యాన్ని స్థానిక సెబ్ స్టేషన్ ఆవరణలో ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ రామాంజినేయులు తెలిపారు. ధ్వంసం చేసిన మద్యం విలువ రూ.32,000 ఉంటుందన్నారు. సెబ్ ఎస్‌ఐ అలీ బేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

కల్లూరు: ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని బీజేపీ నాయకుడు జీఎస్ నాగరాజు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు మంగళవారం ''హర్ ఘర్ తిరంగా అభియాన్ '' కార్యక్రమంలో భాగంగా కల్లూరు చెన్నమ్మ సర్కిల్ నుంచి బళ్లారి చౌరస్తా, కృష్ణనగర్ మీదుగా నంద్యాల చెక్ పోస్టు వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కూటమి పార్టీల నాయకులు రామకృష్ణ, మద్దిలేటి రెడ్డి, శ్రీనివాసులు, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థాలు

కల్లూరు: మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం అంధకారం అవుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిషా విముక్తి భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చడానికి శక్తి మేరకు పని చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈఓఆర్డీ రవికిషోర్, హెచ్ఎం హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి

సి.బెళగల్: గ్రామాభివృద్ధి ప్రణాళికలతోనే పల్లెల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యలయంలో గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై గ్రామ పంచాయతీ కార్యదర్శులకు (పీఎస్), సర్పంచ్‌లకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమంను ఎంపీపీ బొంతల మునెప్పతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. పీఎస్‌లు, సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి బాటలో నిలపాలన్నారు. గ్రామాలలో ప్రజల అవసరాలు, సమస్యలను ప్రణాళికలలో పొందుపరిచి, ప్రాధాన్యత అంశాల వారీగా పరిష్కరించేందుకు పీఎస్‌లు, సర్పంచ్‌లు కృషి చేయాలన్నారు. అనంతరం ఆర్పీలు సునీల్‌రాణి, వెంకటేష్, సైపుల్లబేగ్ శిక్షణను కొనసాగించారు. శిక్షణలో భాగంగా మంగళవారం క్షేత్ర ప్రదర్శన నిమిత్తం కంబదహాల్ గ్రామానికి వెళ్లనున్నట్లు ఈఓఆర్డీ తెలిపారు.

బాధిత రైతులకు పరామర్శ


వివరాలు తెలుసుకుంటున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మండల పరిధిలోని పెద్దటేకూరు గ్రామంలో ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు మూడు గడివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రైతులు కోటయ్య, సుధాకర్, ఎల్లప్ప పశువుల కోసం వేసుకున్న గడివాములు అగ్నికి ఆహుతయ్యాయి. సోమవారం విషయం తెలుసుకున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని బాధిత రైతులను పరామర్శించి, ఆర్థిక సహాయం చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని రైతులను పరామర్శించి, ఆర్థిక సహాయం చేశారు.

ప్రతి నెలా సమావేశాలు

కోడుమూరు రూరల్: గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రతి నెలా విధిగా పంచాయతీ సమావేశాలు నిర్వహించాలని ఈఓఆర్డీ మంజుల సూచించారు. సోమవారం కోడుమూరు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ప్రతి నెలా పంచాయతీలో సమావేశాలు నిర్వహించి ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామంలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఈఓఆర్డీ సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షకులు వెంకటేశ్వర్లు, సుధాకర్, సంజీవరావు అవగాహన కల్పించారు. సర్పంచులు భాగ్యరత్న, పట్టి హనుమంతు, బాలకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీదేవి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసానికి యత్నించడం సిగ్గు చేటు

కోడుమూరు రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పంను ధ్వంసం చేసేందుకు యత్నించడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. ఆ ఘటనను నిరసిస్తూ సోమవారం రాత్రి గూడూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన తెలిపారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం ధ్వంసం చేసేందుకు ప్రయత్నించడం ప్రజస్వామ్యంపై జరిగిన దాడి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలుతోందని మండిపడ్డారు. వారికి త్వరలో ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గూడూరు మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పిఎస్ అస్లాం, సర్పంచులు రామాంజనేయులు, మాధవ స్వామి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ఆబేలు, కౌన్సిలర్లు నందకిశోర్, కిశోర్, మద్దిలేటి, కలాం, నాయకులు గుడిపాడు భాస్కర్‌రెడ్డి, పొన్నకల్ తిమ్మారెడ్డి,ప్రతాప్, శివతదితరులు పాల్గొన్నారు.


గూడూరులో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఆదిమూలపు సతీష్ తదితరులు

వేతనాలు మంజూరు చేయాలి

సి.బెళగల్: గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కూలీలకు పెండిగ్‌లో ఉన్న వేతనాలను మంజూరు చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్ కోరారు. ఆయన సోమవారం పారిశుద్ధ్య కూలీలతో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయం చేరుకుని ఈఓఆర్డీ సందీప్‌కు వినతిపత్రం ఇచ్చారు. మోహన్ మాట్లాడుతూ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌లో భాగంగా గ్రామాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కూలీలకు ఎనిమిది నెలలుగా వేతనాలు అందడం లేదని, అధికారులు కూలీల సమస్యలపై సత్వరమే స్పందించి, వేతనాలను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.


ఈఓఆర్డీ సందీప్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ మోహన్, పారిశుద్ధ్య కూలీలు

గ్రామాల సమస్యలపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న డీపీఓ నాగరాజు నాయుడు

కల్లూరు: గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దిపాలు తదితర మౌలిక వసతులపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నాగరాజు నాయుడు అన్నారు. సోమవారం కల్లూరు మండల పరిషత్ సమావేశ భవనంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామీణ అంశాలపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ బోయ శారద, డీపీఓ నాగరాజు నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు శిక్షణలో తెలుసుకున్న అంశాలను గ్రామాల్లో అమలు చేయాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ అంజనేయులు, ఈఓఆర్డీ రవికిషోర్, ఎంఈఓ వనజకుమారి పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌పై ఆసక్తి చూపని అధికారులు

సి.బెళగల్: మండల కేంద్రంల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం – పీజీఆర్ఎస్) కార్యక్రమ నిర్వహణపై అధికారులు ఆసక్తి చూపడంలేదు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి కొంత మంది నామమాత్రంగా హాజరవడం, మరికొందరు ఆలస్యంగా రావడం, పలువురు ఎలాంటి ముందస్తు అనుమతులు, సమాచారం లేకుండా డుమ్మా కొట్టారు. ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయ పనులమీద వెళ్లగా వారి స్థానంలో మండల పరిషత్ కార్యాలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వారితో పాటు మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, సెరీకల్చర్ టీఏ పద్మావతి, హౌసింగ్ వర్క్ ఇనిస్పెక్టర్ రంగన్నలు మాత్రం కార్యక్రమం చివరవరకు ఉన్నారు. వెలుగు ఏపీఎం వెంకటస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ రిజిస్టర్‌లో సంతకాలు చేసి మధ్యలోనే వెళ్లిపోయ్యారు. కాగా ఎంఈఓలు, పీఆర్, విద్యుత్, ఇరిగేషన్ ఏఈలు, పశువైద్యశాఖ, పీహెచ్‌సీ అధికారులు ఎలాంటి సమాచారం లేకుండా గైర్హాజరైనట్లు సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంపై మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొండాపురం నుంచి విద్యాపరమైన సమస్యలు తెలిపేందుకు వచ్చిన ప్రజలు విద్యాశాఖ అధికారులు లేకపోవడంతో వెనుదిరిగారు.


సి.బెళగల్ తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ హాజరైన కొద్దిమంది అధికారులు

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

కోడుమూరు రూరల్: కోడుమూరు–గూడూరు రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించాలంటూ గూడూరు సీపీఎం మండల కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు. రూ.6.75 కోట్లతో చేపట్టిన కోడుమూరు–గూడూరు రోడ్డు నిర్మాణాన్ని సోమవారం సీపీఎం నాయకులు పరిశీలించి నిరసన వ్యక్తం చేశారు. చనుగొండ్ల వద్ద రోడ్డు నిర్మాణం నాసిరకంగా ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోహన్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా కోడుమూరు, చనుగొండ్ల, గూడూరు ప్రజలు రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. అయితే కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకరాలిచ్చి నాసిరకంగా రోడ్డును నిర్మిస్తున్నారన్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించి పనులు నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మోహన్ కోరారు. సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, మాధవకృష్ణయ్య, కోటయ్య, రామాంజనేయులు, గుంటప్ప, డీవైఎఫ్ఐ నాయకులు బాలు, భరత్ పాల్గొన్నారు.


దెబ్బతిన్న రోడ్డును చూపుతున్న గూడూరు సీపీఎం నాయకులు

రైతులకు అవసరమైన మందులనే విక్రయించాలి


విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: రైతులకు అవసరమైన మందులు, ఎరువులను మాత్రమే విక్రయించాలని, ఇతర మందులు అంటగట్టాలని చూస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ హెచ్చరించారు. సోమవారం కోడుమూరులోని విత్తన, ఎరువుల దుకాణాల్లో ఏఓ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ విత్తనాలు, ఎరువులకు సంబంధించిన స్టాక్ రికార్డులు, లైసెన్స్‌లను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. ప్రతి దుకాణదారుడు అనుమతి ఉన్న కంపెనీల విత్తనాలు, ఎరువులను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. విత్తనాలు, మందుల కొనుగోలు సమయంలో రైతులకు తప్పని సరిగా రసీదు ఇవ్వాలన్నారు. అనుమతి లేని విత్తనాలు, మందులు విక్రయించినట్లు తెలిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని ఏఓ హెచ్చరించారు.

సర్దుబాటును వ్యతిరేకిస్తున్నాం

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్

ఓర్వకల్లు: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా చేపట్టిన పని సర్దుబాటును వ్యతిరేకిస్తున్నామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ అన్నారు. సోమవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈఓ–2 ఓంకార్ యాదవ్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నెలకొన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తి చేయకుండా తాత్కాలికంగా సర్దుబాటు చేయడం తగదన్నారు. ప్రక్రియలో ఉపాధ్యాయ సంఘాల సూచనలను పాటించకుండా అశాస్త్రీయంగా చేపట్టడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే సోమవారం జరగాల్సిన ఉపాధ్యాయుల సర్దుబాటు కౌన్సెలింగ్‌ను రాష్ట్ర ఫ్యాప్టోశాఖ పిలుపు మేరకు బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయ సంఘాల సూచనలు పాటించాలని డిమాండ్ చేశారు.ఫ్యాప్టో నాయకులు శేషాచలం, సురేష్‌కుమార్, గజేంద్ర, ప్రభుదాస్, నిస్సార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


ఎంఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

తైక్వాండో పోటీల్లో ప్రతిభ


క్రీడాకారిణిని అభినందిస్తున్న సంఘం ప్రతినిధులు

ఓర్వకల్లు: తైక్వాండో పోటీల్లో ఓర్వకల్లు మండలం హుసేనాపురం గ్రామానికి చెందిన దివ్యశ్రీ బంగారు పతకం వచ్చినట్లు తైక్వాండో జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. ఇటీవల తిరుపతిలోని శ్రీనివాస ఇండోర్ స్టేడియంలో అంతర్ జిల్లాల పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. మొత్తం 250 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. జిల్లా నుంచి 25 మంది బాలికలు పాల్గొన్నట్లు తెలిపారు. బంగారు–11, వెండి– 5, కాంస్య– 9 పతకాలు సాధించినట్లు వెల్లడించారు. దివ్య శ్రీని హారికా గ్రూప్ ఆఫ్ కంపెనీ ఎండీ విజయ్‌కుమార్, ఏపీ తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరి బాబురావు అభినందించారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

గడివేముల: ఎంపీడీఓగా అల్లంరాజు శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.